క్లుప్తంగా

డీసీపీగా సంపూర్ణ మహాపాత్ర బాధ్యతల స్వీకరణ

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ డీసీపీ – 1గా సంపూర్ణ మహాపాత్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ సిటీప్లానర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు డీసీపీగా (డెప్యూటీ సిటీప్లానర్) పదోన్నతిపై గుంటూరుకు బదిలీ కావడంతో గురువారం నగర కమిషనర్ కీర్తి చేకూరిని మర్యాదపూర్వకంగా కలిశారు.

భక్తిశ్రద్ధలతో విశేషార్చనలు



పాత గుంటూరు: శ్రావణ మాసం సందర్భంగా అరండల్ పేటలోని శ్రీ అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీ నారాయణస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు మత్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో 1800 మంది ముత్తైదువులు కోటి నాలుగు లక్షల నామ పారాయణతో అమ్మవారిని సేవించారు. గోపూజ, శ్రీ చక్ర మహామేరుకు విశేషాభిషేకం అనంతరం విష్వక్సేన పూజతో కార్యక్రమాలు ప్రారంభించారు. అమ్మవారికి రెండు లక్షల గాజులతో అభిషేకార్చన నిర్వహించారు. శాంతి హోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాల్ని వేద పండితులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

నిబంధనలు పాటించని ప్రైవేటు బస్సులపై కేసులు నమోదు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో కాంట్రాక్టు క్యారేజీ బస్సులు, మోటారు క్యాబ్‌లు నిలిపితే చర్యలు తీసుకుంటామని డీటీసీ షేక్ కరీం హెచ్చరించారు. ఇందులో భాగంగా ఈనెల 13న ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో నిలిపిన ఐదు ప్రైవేటు బస్సులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సిటీ బస్టాండ్‌కు మూడు కిలోమీటర్లు, పట్టణాల పరిధిలోని బస్టాప్‌లకు రెండు కిలోమీటర్ల పరిధిలో ప్రైవేటు బస్సులు నిలపకూడదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రైవేటు యాజమాన్యాలు, ఏజెంట్లకు సమావేశం పెట్టి ఆదేశాలు జారీ చేశామని, దానికి సంబంధించి నోటీసులు కూడా ఇచ్చినట్లు తెలిపారు. నిబంధనలు పాటించకుండా ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిలుపుతున్న బస్సులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇక నుంచి నిత్యం తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు పాటించని బస్సులపై చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు

తాడేపల్లి రూరల్: కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెస్సల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) విజయవాడ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు అమరావతి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.వి. తులసీ రామ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం, మహానాడులో గల అసిస్టెంట్ ఇంజినీర్ వారి కార్యాలయ ప్రాంగణంలో విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు కార్యక్రమం ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్, ఫోరం సభ్యులు, సూపరింటెండింగ్ ఇంజినీర్, సీఆర్‌డీఏ అమరావతి విద్యుత్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారులు ఫిర్యాదులను రాతపూర్వకంగా సర్వీస్ కనెక్షన్ నంబర్, పూర్తి చిరునామా, సెల్ నంబర్‌తో అర్జీ ఇచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

బకింగ్‌హామ్ కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహం



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని బకింగ్‌హామ్ కెనాల్‌లో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని తాడేపల్లి పోలీసులు గురువారం వెలికితీశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బకింగ్‌హామ్‌కెనాల్‌లో మహిళ మృతదేహం కొట్టుకు వచ్చినట్లు సమాచారం అందడంతో పశువుల హాస్పిటల్ బ్రిడ్జి వద్దకు వెళ్లి బయటకు తీశామని తెలిపారు. మహిళను గుర్తించేందుకు ఆధారాలు లభించలేదని,వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉండొచ్చని చెప్పారు. ఎత్తు 5 అడుగులు, ఒంటిపై చుడీదార్, కింద ప్యాంటు బ్లూ కలర్‌పై ఎరుపు, తెలుపు పూలు ఉన్నాయని, పై కోటు గులాబీ రంగు కలిగి ఉందని తెలిపారు. మహిళను ఎవరైనా గుర్తిస్తే తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

దోమతెరల పంపిణీ

తెనాలి అర్బన్: లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో తెనాలి డబల్ హార్స్ సంస్థ సహకారంతో రామలింగేశ్వరపేట డొంక రోడ్డులో యాభై మంది పేదలకు గురువారం దోమతెరల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ప్రతినిధి అబ్దుల్ వహీద్ బాషా మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో దోమలు పెరిగే అవకాశం ఉందని, వాటి బారి నుంచి కాపాడుకునేందుకు దోమతెరల్ని పంపిణీ చేసినట్లు తెలిపారు.

గాంధీ పార్క్ త్వరలో ప్రారంభం

కమిషనర్ కీర్తి చేకూరి



గాంధీ పార్కులో పర్యటిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: గాంధీ పార్క్‌ను త్వరలో ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి వెల్లడించారు. ఆమె గురువారం పార్క్‌ని పరిశీలించారు. త్వరలో ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రధానమైన గాంధీ పార్క్ అభివృద్ధి పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రధాన గేటులోని ఫౌంటెన్, గులాబీ తోట, సెల్ఫీ పాయింట్స్, క్లాక్ టవర్, చెస్ బోర్డ్, జంగిల్ బుక్, ఓపెన్ జిమ్, పిల్లల ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్‌లను పరిశీలించారు. కొన్ని చోట్ల మొక్కలు ఎండిపోయాయని, వాటి స్థానంలో కొత్తవి పెంచాలని ఏడీహెచ్‌కి చెప్పారు. సివిల్ పనుల్ని పెండింగ్ లేకుండా శుక్రవారం నాటికి పూర్తి చేయాలని ఎస్ఈని ఆదేశించారు. అనంతరం పార్క్‌లో లైటింగ్‌ని పరిశీలించారు. నిర్దేశిత ప్లాన్ మేరకు ఏర్పాటు చేసిన ప్రతి లైట్ వెలగాలని, మరొకసారి తనిఖీ చేయాలని ఈఈకి సూచించారు. వాహనాలు పార్క్ చేసిన వారు నేరుగా లోపలకు రాకుండా, మెయిన్ గేటు ద్వారానే వచ్చేలా చూడాలని తెలిపారు. టాయ్‌లెట్స్ పార్క్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పార్క్ ఎదురుగా ఆక్రమణలు తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ భాస్కర్, ఈఈలు కోటేశ్వరరావు, కొండారెడ్డి, ఏడీహెచ్ రామారావు, డీఈఈలు శ్రీనివాసరెడ్డి, కళ్యాణరావు, డీసీపీ కోటయ్య, ఎస్.ఎస్. ఆయుబ్‌ఖాన్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంక్

నెహ్రూనగర్: ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంక్ సాధ్యమని నగర కమిషనర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. ఆమె గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విభాగాధిపతులు, అధికారులు, సచివాలయ కార్యదర్శులతో ఇండియన్ స్వచ్ఛ లీగ్- 2.0పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో ప్రజల సహకారంతో జాతీయ స్థాయిలో మూడో స్థానం సాధించామని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0లో నగర ప్రజలలు కూడా హెటీటీపీఎస్://ఇన్నోవేట్ ఇండియా.మైజీవోవీ.ఇన్/ఐఎస్ఎల్‌సీజన్ 2 యాప్‌ని డౌన్లోడ్ చేసుకొని, వివరాలు పూర్తి చేసి, సెల్ఫీ దిగి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కమిషనర్ కోరారు. దీని ద్వారా నగరానికి జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంక్ వస్తుందని తెలిపారు. శుక్ర, శనివారాల్లో వార్డ్ సచివాలయాల వారీగా వలంటీర్లు, సెక్రటరీలు తమ సచివాలయం పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0పై అవగాహన కల్పించి, యాప్ ద్వారా వారి సెల్ఫీ అప్‌లోడ్ చేయించాలని ఆదేశించారు. ప్రతి విద్యా సంస్థలో విద్యార్థులతో కూడా సెల్ఫీ తీసుకోవాలని సూచించారు. ఆదివారం బీఆర్ స్టేడియంలో మెగా సెల్ఫీ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమ సూపర్వైజరీ అధికారులుగా డెప్యూటీ కమిషనర్లను నియమించామని చెప్పారు. అనంతరం పారిశుద్ధ్యంపై ఎంహెచ్ఓ, శానిటేషన్ కార్యదర్శులతో సమీక్షించారు. నగరంలో పారిశుద్ధ్య పనులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు ఉదయం మస్టర్ సమయం, 8, 10 గంటలకు, మధ్యాహ్నం గ్యాంగ్ వర్క్ సమయంలో నోట్ క్యాంలో ఫోటోలు తీసి పంపాలని కమిషనర్ ఆదేశించారు. కార్మికుల సెలవులపై ప్రతి రోజు రిపోర్ట్ ఇవ్వాలని ఎంహెచ్‌వోని ఆదేశించారు. ఎన్నికల సర్వేపై మాట్లాడుతూ బీఎల్‌వోలు సర్వే చేసిన ఫారాల్ని వెంటనే ఆన్‌లైన్ చేయించేలా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్లను ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, నోడల్, సూపర్వైజరీ అధికారులు పాల్గొన్నారు.

పఠనాభివృద్ధికి గ్రంథాలయాలు దోహదం



గాడిచర్ల సర్వోత్తమరావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ మనోహర్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడానికి గ్రంథాలయాలు దోహదం చేస్తాయని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో గురువారం గ్రంథాలయ ఉద్యమ పితామహుడు గాడిచర్ల సర్వోత్తమరావు 141వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మనోహర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో జైలుకు వెళ్లిన మొదటి వ్యక్తి సర్వోత్తమరావు అని తెలిపారు. పత్రికా రచయితగా, సాహితీకారునిగా వయోజనుల కోసం ఎన్నో పుస్తకాలను రాశారని వివరించారు. పేదరికంలో జన్మించినప్పటికీ చదువుపై ఆసక్తితో కష్టపడి చదువుకుని, సమాజ చైతన్య కోసం స్వరాజ్యం అనే పత్రికను ప్రారంభించడం ద్వారా స్వాతంత్ర్య ఉద్యమానికి చైతన్యం తెచ్చిన వ్యక్తి అని కొనియాడారు. ఆంధ్ర వర్సిటీ సెనేట్ సభ్యునిగా, జీవించి ఉన్నత కాలం గ్రంథాలయ సంఘానికి అధ్యక్షునిగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ శాఖాధిపతి బి.సాయికళ, వైస్ ప్రిన్సిపాల్ బి. మురళీధర్, అధ్యాపకులు సురేష్, అప్పారావు, స్వామి, శ్రీనివాసరావు, సౌజన్య, కాశీరత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ చైతన్యానికి చిహ్నం హిందీ



లక్ష్మీపురం: జాతీయ చైతన్యానికి చిహ్నం హిందీ భాష అని గాయకుడు ఎస్.ఎస్.వి.ఎన్. మల్లేశ్వరరావు తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో అధిక మంది మాట్లాడే భాష కాబట్టి హిందీని జాతీయ భాషగా గుర్తించారని తెలిపారు. దేశంలో ఒక ప్రాంతం దాటి ఇంకో ప్రాంతం వెళ్లి వ్యాపార, ఉద్యోగ వ్యవహారాలు కొనసాగించాలంటే అందరికీ అర్థమయ్యే భాష అవసరమని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు హిందీ ఆ అవసరం తీరుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు 144 సెక్షన్ అమలు

తెనాలి రూరల్: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అరెస్ట్, రిమాండ్ నేపథ్యంలో తెనాలి పట్టణం, మండలంలో 144 సెక్షన్ అమలు చేసినట్టు తహసీల్దార్ కె. రవిబాబు బుధవారం రాత్రి పొద్దుపోయాక తెలిపారు. ఆంక్షలు తక్షణమే అమల్లోకి వస్తాయని, 30వ తేదీ అర్ధరాత్రి వరకు ఉంటాయని చెప్పారు. అనుమతులు లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించరాదని, నలుగురికంటే ఎక్కువ మంది గుమికాకూడదని సూచించారు. కర్రలు, రాళ్లు సహా ఎటువంటి ఆయుధాల్ని కలిగి ఉండకూడదని పేర్కొన్నారు. ఇప్పటికే పోలీసు శాఖకు కచ్చితమైన ఆదేశాల్ని జారీ చేశామని, నిబంధనల్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలుంటాయని తహసీల్దార్ స్పష్టం చేశారు.

అపజయాలే విజయానికి పునాది



డాక్టర్ బి.వాసును సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: అపజయాలను విజయానికి పునాదిగా చేసుకుని, జీవితం ఉన్నత స్థితికి చేరుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని బెంగళూరుకు చెందిన ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ బి.వాసు పేర్కొన్నారు. గురువారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో స్టూడెంట్ వెల్నెస్ సెంటర్ ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వాసు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే సమస్యలను సవాళ్లుగా తీసుకొని ఎదుర్కోవాలని, ఆత్మహత్య ప్రేరణకు లోనుకాకుండా ఉండాలన్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు విద్యార్థి దశ నుంచే లక్ష్యసాధన దిశగా నిత్యం కృషి చేయాలని సూచించారు. సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.లక్ష్మీరాణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యల్ని పరిష్కరించాలి

తెనాలి: అంగన్‌వాడీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు సమస్యల్ని పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ విజ్ఞప్తిచేశారు. అంగన్‌వాడీ తెనాలి ప్రాజెక్ట్ మహాసభ గురువారం స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. రంగపుష్ప, నిర్మల జ్యోతి, అనూరాధ అధ్యక్షత వహించారు. రైతు సంఘ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి, సీఐటీయూ తెనాలి కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలి, అంగన్‌వాడీ జిల్లా నాయకులు ఏ.వి.ఎన్. కుమారి పాల్గొన్నారు.

వెన్నుముక గాయం.. అశ్రద్ధ చేస్తే ప్రమాదం

- నేడు అందుబాటులో అత్యాధునిక చికిత్సలు
- దెబ్బతిన్న నరాలకు రీహాబిలిటేషన్ సెంటర్ ద్వారా పటుత్వం

మనిషిని నిటారుగా నిలబెట్టే వెన్నుముకకు గాయాలైనప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోని పక్షంలో జీవితాంతం అవస్థలు పడుతాడు. శరీరంలో కీలకమైన వెన్నుముకకు దెబ్బతగిలితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. మనిషి కూర్చోలేక, నిలబడలేక మంచానికే పరిమితమైపోతాడు. వెన్నుముక గాయాలపై అవగాహన లేకపోవడం, అపోహలు ఉండటంతో పలువురు చికిత్సలకు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో స్పైనల్ కార్డ్ ఇంజూరీస్‌పై అవగాహన కల్పించేందుకు వారం రోజులపాటు అవగాహన వారోత్సవాల్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

గుంటూరు మెడికల్: సాధారణంగా రోడ్డు ప్రమాదాల వల్ల, శక్తికి మించి బరువుల్ని మోయడం ద్వారా వెన్నుముక దెబ్బతింటుంది. వాహనాలపై ప్రయాణిస్తున్న సమయంలో అదుపు తప్పి పడిపోవడం, మరో వాహనం ఢీకొనడం ద్వారా కిందపడిన వ్యక్తి వెన్నుముక విరిగిపోతోంది. చెట్లు ఎక్కినరికే సమయంలో, ఎత్తైయిన భవనాలపై పని చేస్తున్న సమయంలో అప్రమత్తంగా లేకపోతే కింద పడితే దెబ్బతింటుంది. ఇలాంటి వారికి నేడు అత్యాధునిక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అయితే, శస్త్రచికిత్స చేసినప్పటికీ గాయమైన సమయంలో వెన్నుముక చుట్టుపక్కల నరాలు పటుత్వం కోల్పోయి వ్యక్తికి నడక ఇబ్బందిగా మారుతుంది. ఇలాంటి వారికి రీహాబిలిటేషన్ చికిత్స ద్వారా నరాల్లో ఉన్న పటుత్వం ద్వారా నడకను సరి చేయవచ్చు


బాధితులు అధికమే...

భారతదేశంలో 1.5 మిలియన్ల ప్రజలు వెన్నుముక గాయాలతో బాధపడుతున్నారు. ప్రతి ఏడాది 20వేల మంది కొత్తగా ప్రమాదాల్లో గాయపడి వెన్నుముక సమస్యలతో బాధపడుతున్నారు. కొంత మంది ఇన్‌ఫెక్షన్లు, వెన్నుముక టీబీ ద్వారా సమస్యల బారిన పడుతున్నారు. బాధితుల్లో 80 శాతం పురుషులు, 20 శాతం మహిళలు ఉన్నారు. వీరిలో సగం మంది 15 నుంచి 30 సంవత్సరాల వయస్సు వారే. యుక్త వయస్సులో ఏదో పనిచేస్తూ లేదా ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులకు ఆర్థికపరమైన అంశాల్లో చేదోడువాదోడుగా ఉండాల్సిన వారు వెన్నుముక గాయాల వల్ల మంచానికే పరిమితమై భారంగా మారుతున్నారు. వెన్నుముక గాయమైన వారికి స్పర్శ, చలనం ఉండదు. వెన్నుముక భాగమంతా కదలిక లేక నడవలేకపోవడం, మలమూత్రాల్ని అదుపులో పెట్టుకోలేక మంచంలోనే విసర్జిస్తారు. వెన్నుముక ఆపరేషన్ చేసిన నరాలు చచ్చుబడిపోవడం వల్ల నడక ఇబ్బందిగా మారుతుంది. వీరికి రీహాబిలిటేషన్ ద్వారా ఉన్న నరాల పటుత్వం ద్వారా నడక నేర్పించవచ్చు. ఏపీలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విశాఖపట్నంలో సెంటర్ పని చేస్తోంది.



వెన్నుముకకు గాయం

ఉచిత వైద్య సేవలు



స్పైనల్ కార్డ్ గాయాలపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో జీవితాంతం మంచానికే పరిమితమై అవస్థలు పడుతున్నారు. గుంటూరులోని మల్లికా స్పైన్ రీహాబ్ సెంటర్‌లో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. వ్యాధి నిర్ధారణ, న్యూరాలజీ చెకప్, జనరల్ ఎసెస్మెంట్, వైద్య సలహాలు, ఫిజియోథెరపీ ఉచితంగా చేస్తున్నాం.

– డాక్టర్ జె.నరేష్‌బాబు, స్పైన్ సర్జన్

పేదలకు వైఎస్సార్ పెన్షన్ కానుక వరం

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా



నూరి ఫాతిమాను సత్కరిస్తున్న స్థానికులు, పింఛన్‌దారులు

పట్నంబజారు: వైఎస్సార్ పెన్షన్ కానుక పేదలకు వరం అని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ఆదేశాల మేరకు గురువారం నియోజకవర్గంలోని 55వ డివిజన్‌లో నూతనంగా మంజూరైన పింఛన్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఇంటికీ పెద్ద కొడుకులా బాధ్యత వహిస్తూ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్ అందజేస్తున్నారని తెలిపారు. ఆపదలో ఉన్న వారికి పింఛన్ మంజూరు చేయడంపై ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో 55వ డివిజన్ కార్పొరేటర్ ధూపాటి వంశీ, సాల్మాన్, అనిల్, వినోద్ పాల్గొన్నారు. అనంతరం పింఛన్‌దారులు, స్థానికులు నూరిఫాతిమాను సత్కరించారు.

భాష మీద పట్టుతోనే మనిషి ఉన్నతి



సాహితీవేత్త రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న పీఎం ప్రసాద్, అధ్యాపక బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: భాష మీద పట్టుతోనే జీవితంలో అనుకున్నది సాధించేందుకు అవకాశాలు ఉంటాయని సాహితీవేత్త తూములూరి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల హిందీ విభాగ ఆధ్వర్యంలో గురువారం హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ విభాగాధిపతి డాక్టర్ గుడిపూడి విజయరత్నకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కువ మంది మాట్లాడే భాషల్లో హిందీ రెండో స్థానంలో ఉందని తెలిపారు. భాషను నేర్చుకునే విషయంలో అలసత్వం పనికిరాదని, శ్రమించి క్రమ పద్ధతిలో నేర్చుకున్నప్పుడే పట్టు సాధించవచ్చని సూచించారు. బాషను సంపూర్ణంగా నేర్చుకున్న వారే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగగలరని తెలిపారు. సభలో కళాశాల ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.ఎస్. దుర్గా ప్రసాద్, విద్యావిషయక సమన్వయకర్త డాక్టర్ కె.కాళిదాస్, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ అందె బాల శౌరి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, హిందీ అధ్యాపకులు షేక్ బాజీ, చిలకా అరుణ, ఈ. సుదర్శన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా హిందీలో అధిక మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

అర్హత గల వారందరికీ పింఛన్ల మంజూరు

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం



వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్సీ ఏసురత్నం

గుంటూరు ఎడ్యుకేషన్: అర్హత గల వారందరికీ పింఛన్లు మంజూరు చేసే విధంగా సీఎం వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం పేర్కొన్నారు. 25వ డివిజన్ పరిధిలోని 77, 78, 79 సచివాలయాల్లో గురువారం జరిగిన కార్యక్రమంలో కొత్తగా 52 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ ఏసురత్నం మాట్లాడుతూ ఆంక్షలు లేని విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ మంజూరు చేయడంలో ప్రభుత్వం కచ్చితమైన మార్గదర్శకాలు ఇచ్చిందని తెలిపారు.

క్రైం కార్నర్

ఖాతాలో నగదు మాయంపై కేసు నమోదు

పట్నంబజారు: ఖాతాలో నగదు మాయంపై కేసు నమోదైంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాడీపేట 1వ లైనులో నివసించే ఆత్మకూరి లలితకుమారి బాపట్ల వ్యవసాయ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. జూన్ 22న ఆమెకు సంబంధం లేకుండా యూనియన్ బ్యాంకు అకౌంట్‌లోంచి రూ. 1.16 లక్షలు మాయమయ్యాయి. గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- **ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు**

ఆన్‌లైన్‌లో చెల్లించిన నగదు తిరిగి ఇవ్వకుండా మోసం చేసిన ఘటనపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంపాలెంలోని మూడు బొమ్మల సెంటర్‌లో నివసించే కట్టా నిఖిల్ ఎంసెట్ పూర్తి చేసి ఖాళీగా ఉంటున్నాడు. పార్ట్ టైమ్ జాబ్ కోసం ఆన్‌లైన్‌లో వెతుకుతుండగా కివి.కామ్ ఎయిర్ టిక్కెట్టుకు సంబంధించి వెబ్‌సైట్ పార్ట్ టైమ్ జాబ్ ఉన్నట్లు గుర్తించాడు. అందులో రూ. 10వేలు ప్రతిరోజూ జమ చేస్తే టికెట్టు అమ్మకాలకు అనుగుణంగా కమిషన్ ఇస్తామని చెప్పడంతో దఫాల వారీగా రూ. 23 లక్షలు జమ చేశాడు. నిఖిల్‌కు రూ. 40 లక్షలు వస్తాయని సదరు వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. తన డబ్బుల్ని అడుగుతుండటంతో మరో రూ. 20 లక్షలు చెల్లిస్తే రూ. 60 లక్షలు ఇస్తామని చెప్పడంతో మోసపోయినట్లు గుర్తించిన నిఖిల్ పోలీసుల్ని ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- **వ్యక్తిపై దాడి**

వ్యక్తిని బలవంతంగా అపహరించుకు పోయి గాయపరిచిన ఘటనపై కేసు నమోదు అయింది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిట్టపల్లి శివశంకర్ పత్తి వ్యాపారం చేసి బాగా నష్టపోయాడు. రూ. 16 కోట్ల వరకు అప్పుల పాలయ్యాడు. పలువురికి డబ్బులు చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలో గురువారం ఎల్వీఆర్ దారిలో మట్టుపల్లి ఎలక్ట్రానిక్స్ వద్ద డబ్బులు చెల్లించాల్సిన గురువులు, కిశోర్, సాంబశివరావు, మల్లికార్జునరెడ్డి తోపాటు, మరో 20 మంది మంది శివకుమార్ కారును అడ్డగించి బలవంతంగా అదే కారులో దేవాపురం తీసుకెళ్లారు. తీవ్రంగా అతడ్ని గాయపరిచి డబ్బులు చెల్లించాలని ఇబ్బందులకు గురి చేయడంతో బాధితుడు పోలీసుల్ని ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- **బంగారానికి మెరుగు పెడతామని అపహరణ**

బంగారానికి మెరుగు పెడతామని నమ్మించి ఆభరణాలు దోచుకు పోయిన ఘటనపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పండరీపురం 5వ లైనుకు చెందిన బొలిశెట్టి రమేష్ చంద్రగుప్తా నివాసానికి గురువారం ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చారు. ఆభరణాలకు మెరుగు పెడతామని చెప్పడంతో తొలుతగా పంచలోహ ఆభరణాలిచ్చారు. వాటికి చక్కగా మెరుగు పెట్టడంతో నమ్మిన రమేష్ చంద్ర గుప్తా బంగారు ఆభరణాలిచ్చాడు. వాటిని కుక్కర్‌లో వేసి వేడిచేస్తే బాగా మెరుగు వస్తాయని చెప్పడంతో బాధితుడు ఇంట్లోకి వెళుతున్న సమయంలో నిందితులు పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

- **మహిళ మెడలో గొలుసు చోరీ**

మహిళ మెడలో గొలుసు లాక్కొని పరారైన ఘటనపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్వీఎన్ కాలనీకి చెందిన డి.సులోచన ఇంటి నుంచి వేరే వారి ఇంటికి పనుల నిమిత్తం వెళుతోంది. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు ఆమె మెడలోని గొలుసు లాక్కొనే ప్రయత్నం చేశారు. సగం గొలుసు సులోచన చేతిలో ఉండగా, మరో సగం గొలుసు నిందితులు లాక్కొని పరారయ్యారు. సుమారు ఎనిమిది సవర్ల గొలుసు చైన్‌స్నాచింగ్ జరిగిందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- **మహిళపై దాడి**

మహిళపై దాడిచేసి గాయపరిచిన ఘటనపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణబాబు కాలనీలో నివాసం ఉంటే తెలుకుట్ల గంగమ్మ మిర్చి యార్డులో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఆమె కుమారుడు వెంకటకృష్ణ మిర్చి యార్డులో ఆటో తోలుతూ ఉంటాడు. గురువారం అతడి స్నేహితుడు శ్రీనివాస్ పూటుగా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. శ్రీనివాస్‌తో కలసి బయటకు వెళుతున్న వెంకటకృష్ణను గంగమ్మ వెళ్లవద్దంటూ వారించింది. ఈ క్రమంలో కోపంతో శ్రీనివాస్ పక్కన ఉన్న రాడ్‌తో గంగమ్మపై దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

- **విశ్రాంత రైల్వే గార్డ్ మీరావలికి ఘన నివాళి**

లక్ష్మీపురం: విశ్రాంత రైల్వే గార్డ్ మీరావలికి గురువారం అరండల్‌పేటలోని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ గుంటూరు రైల్వే డివిజన్‌లో మీరావలి ప్యాసింజర్ గార్డ్‌గా ఎనలేని సేవలు చేశారని కొనియాడారు.